


నేటి ప్రజావాణి రద్దు: కలెక్టర్

నిర్మల్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇక 'కడెం' మరింత పదిలం!



కడెం ప్రాజెక్టు (ఫైల్)

- కొత్త హంగులు అద్దుకుంటున్న ప్రాజెక్టు
- పదేళ్ల తర్వాత ప్రాజెక్టు గ్యాలరీ పనుల్లో కదలిక
- ఎట్టకేలకు తొమ్మిది స్కార్ గేట్ల మరమ్మతు పనులు షురూ
- ప్రాజెక్టు వద్ద రూ.3.64 కోట్లతో కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు
- గతంలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు ప్రాజెక్టుకు అధునాతన హంగులు
- ఇప్పటికే మెకానికల్ పనులు పూర్తి
- ప్రధానకాలువ గేట్లకు ట్రాస్ రాక్, హెడ్ రెగ్యులేటర్ మోటార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- త్వరలో 2 కిలో మీటర్ల మేర విద్యుత్ లైన్ పొడిగింపు
- వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ ముందస్తు చర్యల్లో ప్రాజెక్టు అధికారుల తలమునకలు

ఖానాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వరుసగా గత ఐదేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే చాలు కడెం పరిసర ప్రాంతాల ప్రజలను ఉరుకులు పరుగులు పెట్టించే కడెం ప్రాజెక్టు ఇకపై మరింత పదిలంగా మారనుంది. గత అనుభవాల దృష్ట్యా ఆ ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా గత రెండేళ్లుగా ప్రాజెక్టు వద్ద మరమ్మతు చర్యలు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. వరుసగా రెండు, మూడేళ్ల కడెం ప్రాంత వాసులను బెంబేలెత్తించిన కడెం ప్రాజెక్టు పూర్తిగా గేటన్నీ దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రాజెక్టు మరమ్మతులకు సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ మరమ్మతు పనులు ప్రారంభమయ్యాక గత ఏడాది వర్షాకాలం ఎటువంటి ఇక్కట్లు లేకుండా ముగిసిపోయింది. రానున్న రోజుల్లో ఎంతటి వరదలు వచ్చినా తట్టుకునేలా ప్రాజెక్టును మరింత పదిలంగా మార్చేందుకు ఇంజనీర్లు శ్రమిస్తున్నారు. తాజాగా కడెం ప్రాజెక్టు వద్ద మెకానికల్ విభాగంలో సివిల్ విభాగంలో పనులను పూర్తి చేసుకొని ఎలక్ట్రికల్ విభాగంలో యుద్ధప్రాతిపదికన పనులను నిర్వహిస్తున్నారు.

పదేళ్ల తర్వాత ప్రాజెక్టు గ్యాలరీ పనుల్లో కదలిక

కడెం ప్రాజెక్టు పట్ల నాటి పాలకుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు అడుగు భాగంలో ఉండే గ్యాలరీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కడెం ప్రాజెక్టు అడుగు భాగాన రెండు గ్యాలరీలు ఒకజర్మన్ గ్యాలరీ ఉన్నాయి. రెండు ఇండియన్ గ్యాలరీలకు 9స్కార్ గేట్లు ఉన్నాయి. పదేళ్లుగా వీటి నిర్వహణ లేక కనీసం గ్యాలరీల వైపు అప్పటి ప్రాజెక్టు నిర్వహణ చూస్తున్న అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుం ఈస్కార్ గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పదేళ్లకు పైగా ఈ గ్యాలరీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద పనులు సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. చెత్తాచెదారాన్ని తొలగించి 9స్కార్ గేట్లకు మరమ్మతులను ప్రారంభించనున్నట్లు ఇంజనీరింగ్ విభాగం అధికారులు అధికారులు చెబుతున్నారు.

రూ.3.64 కోట్లతో కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు


కడెం ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం రూ.3.64కోట్ల నిధులతో ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా మెయిన్ డిస్ట్రిబ్యూషన్ ప్యానల్1, సబ్‌డిస్ట్రిబ్యూషన్ ప్యానల్ 6, ఎల్‌టి కియోస్క్ 1, యుటిలిటీ డిస్ట్రిబ్యూషన్ ప్యానల్ ఒకటి ఏర్పాటు చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెప్తున్నారు. ఇది ఏర్పాటు చేయడం ద్వారా గతంలో ఉన్న సమస్యలను అధిగమించవచ్చంటున్నారు. గతంలో ఒక్కచోట విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే ప్రాజెక్టు మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయేదని తద్వారా చాలా ఇబ్బందులు ఎదురయ్యేవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న అధునాతన ఎలక్ట్రికల్ విధానంతో ప్రాజెక్టు వద్ద ఒక్కో గేటుకు సంబంధించి విద్యుత్‌ను సపరేటుగా వినియోగించుకునేలా సిస్టం తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు.

సివిల్, మెకానికల్ విభాగంలో ఇదివరకే పూర్తయిన పనులు

ప్రాజెక్టు వద్ద సివిల్ మెకానికల్ విభాగంలో నిర్వహించిన పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెప్తున్నారు. పెండింగ్‌లో ఉన్న రోలర్స్ మార్పిడీ, ప్లంబర్ బాక్సుల ఏర్పాటు ఇతరత్రా గేట్ల మరమ్మతు పనులు పూర్తయినట్లు అధికారులు చెప్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి గతంలో 100 కేవీఏ కెపాసిటీ గల జనరేటర్ ఉండగా ప్రస్తుతం 160కేవీఏ కెపాసిటీ గల మరో ఆది నారాయణ జనరేటర్‌ను కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. గతంలో ఎయిర్ కంప్రెసర్ యంత్రం లేక ప్రాజెక్టు గేట్లకు గ్రీసు ఏర్పాటుచేయడంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు ప్రస్తుతం ఎయిర్ కంప్రెసర్ యంత్రాన్ని అందుబాటులోకి తెలుస్తోంది. ఆ యంత్రం సహాయంతో ప్రాజెక్టు గేట్లకు, రోప్‌లకు ముందస్తుగానే గ్రీసును ఎక్కించి రానున్న వర్షాకలంలో గేట్లను ఎత్తడంలో దింపడంలో ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు కుడి వైపు ఉన్న విద్యుత్‌లైన్‌ను ఎడమ వైపుకు పొడిగించనున్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి రూ.43.70 లక్షలు మంజూరైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రధాన కాలువ గేట్లకు ట్రాస్ రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

కెనాల్ వెనుక భాగంలో ప్రాజెక్టు లోపల ట్రాస్ రాక్ చేసేందుకు రూ.4.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ట్రాస్‌రాక్ ఏర్పాటు పూర్తయితే ఇక ప్రధాన కాలువ గేట్ల లీకేజీ సమస్య తీరిపోతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే ప్రధానకాలువ గేట్లను యంత్రాల సహాయంతో ఎత్తేందుకు హెడ్ రెగ్యులేటర్ మోటార్లను బిగించేందుకు రూ.36లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన కాలువలో పూడికతీత కోసం రూ.42లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. కుడి కాలువకు సైతం 8కిలో మీటర్ల మేర ఎన్నార్జై జీఎస్‌లో పూడికతీత పనులు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. మొత్తానికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కడెం ప్రాజెక్టును భవిష్యత్తులో మరింత పదిలంగా మార్చేందుకు అధికారులు చేపట్టిన చర్యలను స్థానికంగా రైతాంగం అభినందిస్తోంది. 68 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే కడెం ప్రాజెక్టు ప్రధాన కాలువైన ఎడమ కాలువ అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో నిధులు మంజూరు చేసి ఆ పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కడెం ఆయకట్టు రైతాంగం కోరుతోంది.



కడెం ప్రాజెక్టు గేట్లకు గ్రీసు ఇతరత్రా మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది



నిధుల మంజూరుకు కృషి

- వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

కడెంప్రాజెక్టు ప్రధానకాల్వ ట్రాస్ రాక్ నిర్మాణానికి, కాల్వ పూడికతీత ఇతరత్రా పనుల కోసం ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదించిన నిధుల మంజూరు కోసం ప్రభుత్వంతో మాట్లాడుతా. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కడెంప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రూ.10కోట్లు మంజూరు చేశాం. ఇతరత్రా పనుల నిర్వహణకు అధికారులు పంపిన మరో ఐదారు కోట్ల రూపాయల ప్రతిపాదనపై సీఎంతో మాట్లాడి మంజూరు చేయిస్తా.



ఎలక్ట్రికల్ విభాగంలో పనులు వేగంగా చేపడుతున్నాం..

- మురళీకృష్ణ, ఏఈఈ, కడెం ప్రాజెక్టు

ప్రాజెక్టు వద్ద ఎలక్ట్రికల్ విభాగంలో పనులు వేగంగా సాగుతున్నాయి. గ్యాలరీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి గ్యాలరీ ఇన్‌స్పెక్షన్‌కు వీలుగా వాటిని సిద్ధం చేస్తున్నాం. తొమ్మిది స్కార్ గేట్లకు మరమ్మతులు నిర్వహించేలా ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు కొనసాగుతున్నాయి.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాజేశ్వర్

నిర్మల్‌రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరం కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పథకం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వి. రాజేశ్వర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1వ తరగతిలో (49) సీట్లు, 5వ తరగతిలో (52) సీట్లు మొత్తం 101 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి రూ. లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.2లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులో పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం (1వ తరగతి 01-06-2019 నుంచి 3105-2020) మధ్య జన్మించిన జనన ధ్రువీకరణ పత్రం, 5వ తరగతిలో చేరే విద్యార్థులు 4వ తరగతి పాస్ అయినట్లు రికార్డు షీట్ తీసుకొని రావాలని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులం, ఆదాయం, ఒక కలర్ ఫొటో, గత సంవత్సరం మార్కుల జాబితా దరఖాస్తుతో సమర్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి దరఖాస్తు ఫారం పొంది పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 15 తేదీ సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల ప్రవేశం కోసం లాటరీ పద్ధతిలో ఈనెల 20న ఎంపిక చేస్తామని తెలిపారు. బాలికలకు 33శాతం, అనధ పిల్లలకు 20శాతం, జోగిని పిల్లలకు 15శాతం, బాండెడ్ లేబర్ పిల్లలకు 15శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. వీరు సంబంధిత అదికారుల నుంచి ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు.

దిలావర్‌పూర్ ఎస్సైగా పడ్వాల్ రవీందర్

దిలావర్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దిలావర్‌పూర్ ఎస్సైగా పడ్వాల్ రవీం దర్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన లోక సందీ ప్ నిర్మల్‌టౌన్‌కు బదిలీపై వెళ్లారు. కుబీర్ ఎస్సైగా పనిచేసిన పడ్వాల్ రవీందర్ బదిలీపై దిలావర్‌పూర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల సహకారం తీసుకుంటానన్నారు. సంఘ వ్యతి రేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భం గా నూతన ఎస్సై రవీందర్‌ను శాలువాతో సన్మానించారు.

రాంపూర్‌లో రోడ్డు ప్రమాదం

నర్సాపూర్(జి), జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన లారీలు రోడ్డు పక్కన నిలపడం వల్లే జరిగాయని స్థానికులు చెబుతున్నారు. మొదటి ప్రమాదంలో రాంపూర్ వద్ద ఆగి ఉన్న ఒక లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మన్మద్ గ్రామానికి చెందిన చిన్నారి వర్షిని (6) తీవ్రంగా గాయపడింది. ఆమెను వెంటనే నిర్మల్‌లోని దేవేందర్ రెడ్డి ఆసుపత్రికి తరలించారు.

నసీరాబాద్‌లో మరో ప్రమాదం



గాయపడిన వారిని 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నసీరాబాద్ గ్రామ పొలిమేరల వద్ద మరో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇక్కడ ఆగి ఉన్న ఒక డీసీఎం వాహనాన్ని ఢీకొనడంతో కుంటాల గ్రామానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో 108 సిబ్బంది ఆనంద్ గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. కానిస్టేబుల్ సంజీవ్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాల వివరాలు సేకరించారు. ఈ ప్రమాదాలు రోడ్డు పక్కన నిలపబడిన భారీ వాహనాల వల్ల కలిగే ప్రమాదాల గురించి మరోసారి గుర్తుచేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెప్తున్నారు.

రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



కలెక్టర్ కార్యాలయంలో సభా వేదికను ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



సమీకృత కార్యాలయంలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

నిర్మల్‌రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా తెలంగాణ ఆర్థిక సంఘం ఛైర్‌పర్సన్ సిరిసిల్ల రాజయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయం సముదాయంలో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు అందరూ పాల్గొని తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

వాహన విడి భాగాలకు వేలం

నిర్మల్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న వాహన విడి భాగాలకు వేలం వేయనున్నట్లు అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్, మోటార్ వాహనాల కార్యాలయంలో 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి వాహనాల విడి భాగాలను, టైర్లు, బ్యాటరీలు, వాడిన ఇంజన్ ఆయిల్ వేలం వేయబడునని తెలిపారు.

హిందూవాహిని పట్టణ కమిటీ ఎన్నిక

భైంసా,జూన్1(ఆంధ్రజ్యోతి): భైంసాపట్టణ హిందూ వాహిని నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినాయక్ ఉపాధ్యక్షులుగా పృథ్వీరాజ్, చరణ్‌సందీప్, యోగేష్, సభ్యులుగా గణేష్, రంజీత్, పురుషోత్తమ్, నవీన్, శివలు ఎన్నికయ్యారు.

తురాటిలో ఘనంగా చండీయాగం

- వర్షాల కోసం ప్రత్యేక పూజలు



తురాటి గ్రామంలో చండీ యాగంలో పాల్గొన్న భక్తులు



అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురాటి గ్రామంలో శ్రీ చండీ యాగాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణం, సకాలంలో వర్షాలు కురవడం, ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే సంకల్పంతోనే ఈ యాగం చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి పూజ, అంకరణ, మంగళహారతి, స్థాపితమైన దేవతల పూజ, మున్నూరు కాపు సంఘ భవనంలో గణపతి లక్ష్మీ హోమం, చండీ యాగం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వేద పండితులు శ్రీ సదాశివ శర్మ ఆధ్వర్యంలో యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం, దుష్టశక్తుల నివారణ వంటి ప్రత్యేక సంకల్పాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు, యువతులు, పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై యాగాన్ని విజయవంతం చేశారు. యాగంలో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు వైభవంగా సాగాయి. పండితులు వేద మంత్రాలతో దేవతలను అవాహనం చేయగా, భక్తులు భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రవచనాలతో చండీ యాగం విశిష్టతను, దాని వల్ల కలిగే ప్రయోజనలను వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో వందలాది మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఈ యాగ నిర్వహణకు గ్రామ ప్రజలు, పలువురు దాతలు, సేవకులు విశేషంగా సహకరించారు. యాగంలో సుధాకర్ శర్మ, కేదారినాథ్ త్రిపాఠి, నరేష్, శశి శర్మ, రమణ చారి పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో సంతోషకరమైన వాతావరణాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేఎల్పీ నేత ఏలేటి

సోన్, జూన్1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాక్‌పట్ల గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం పూర్తిస్థయిలో కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యంపై ఆరా తీశారు. తప్ప, మ్యాచర్ పేరుతో రైతులను మోసగిస్తే సహించే ప్రసక్తే లేదని అన్నారు. రైతులను దోపిడీ చేసే రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సరికెల గంగన్న, మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, జక్క రాజేశ్వర్, నర్సారెడ్డి, ముత్యం, నర్సయ్య, గంగారెడ్డి, భీముడు, పోశెట్టితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో గేదె మృతి

నిర్మల్ రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం పాము కాటుతో గేదె మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టేరి నారాయణ రోజు మాదిరిగానే శనివారం రాత్రి తన ఇంటి సమీపంలోని షెడ్డులో కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం చూడగా గేదె చనిపోయి కనిపించింది. పాము కాటుతో మృతి చెందిందినట్లు అనుమానంతో పశువైద్యాధికారులను సంప్రదించగా వారు అదే విషయాన్ని వైద్యులు నిర్ధారించారు. గేదె చనిపోవడంతో సుమారు రూ.50వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దస్తురాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం 1996-1997 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు అందరూ కలిసి ఒకే చోటికి చేరి తమకు చదువు నేర్పిన గురువులకు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. స్నేహితులందరూ ఆట పాటలతో కేరింతలతో అలరించారు.



వేదికపై 119-1997 బ్యాచ్ విద్యార్థులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా పోచమ్మ ఆలయంలో బోనాలు

తలమడుగు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండం గ్రామ సమీపంలో గల ప్యాట పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. మినీ అడెల్లిపోచమ్మగా అభివృద్ధి చెందుతున్న ఉమ్మడం పోచమ్మ ఆలయంలో ప్రతి ఆదివారం వందలాది భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులను చెల్లించుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయదారులు ప్రతీయేడు తమ పంట పొలాల్లో విత్తనాలు నాటేముందు అమ్మవారికి మొక్కులు చెల్లించి తమ పంటలు సమృద్ధిగా పోచమ్మ తల్లిని నమ్ముకున్న వారికి నమ్ముకున్న అత్తగా కొంగు బంగారంలా తమ కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేపడితే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని కోరుతున్నారు. ఇక్కడ పూజలు నిర్వహించేందుకు మండల వాసులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తుల తరలి వస్తారు.

ఆలయాల వద్ద హలాల్ నిషేధం

బోథ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామదేవతలైన పోచమ్మ మహాలక్ష్మి కొట్టాల పోచమ్మ ఆలయాల వద్ద హలాల్‌ను నిషేధించడం జరిగిందని ఆలయ కమిటీ వారు పేర్కొన్నారు. అంతేగాక ఆయా ఆలయాలలో హలాల్‌ను నిషేధిస్తున్నట్లు పోస్టర్లను అతికించారు. ఈ విషయమై భక్తులు సహకరించాలని కోరారు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

బోథ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల ప్రజలు విజయవంతం చేయాలని ఎంపీడీవో రమేష్ కోరారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీలలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈ సందర్భంగా కోరారు.

21 ఏళ్లకు కలిసిన పూర్వ విద్యార్థులు

బోథ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న 2023 సంవత్సరానికి చెందిన విద్యార్థులు 21 సంవత్సరాలకు కలుసుకోవడం జరిగింది. అందరూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. వారి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు!

● గుడిహత్నూర్‌లో ప్రారంభానికి నోచుకోని భవనం ● పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం కోసం ఎక్స్‌రోడ్డు వద్ద నిర్మాణం

● నిరుపయోగంగా ఉన్న భవనం ఇదే..



గుడిహత్నూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు వెచ్చించి మండలకేంద్రంలో నిర్మించిన భవనాన్ని లక్షణంగా వదిలేశారు అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోక ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలో ఎక్స్ రోడ్ వద్ద ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం మినీ అంగన్‌వాడీ కేంద్రం కోసం కొత్త భవనం మంజూరు అయింది. లక్షలాది రూపాయలతో రెండు భవనాలు కలిపి ఒకే చోట నిర్మించారు, నిర్మించి దాదాపు మూడు నుంచి నాలుగు సంవత్సరాలు గడుస్తుంది. ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. ఎక్స్ రోడ్ హనుమాన్ నగర్, జై భీంనగర్ కాలనీ పిల్లలు బాలింతలు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మరోవైపు ఇక్కడి ప్రజలు వైద్యం కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇబ్బందులు పడుతూ అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. భవనం నిర్మించిన కాంట్రాక్టర్ మంచి నీటి సౌకర్యం బోరు వేయలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించి వదిలేశాడు. ఈ భవనంలో. కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిరుపయోగంగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకరావాలని కోరుతున్నారు.



బోరుబావి వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

పోడు భూముల్లో.. ఇందిర సౌర గిరిజల వికాసం

(5వ పేజీ తరువాయి...)

నిర్వహించి రైతుల అవసరాల మేరకు బోర్వెల్ వేస్తారు. 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ సోలార్ పంపు ప్యానల్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి సాగునీరు అందేలా చూడనున్నారు.

ప్రయోగాత్మకంగా గోండు కొత్తగూడలో..

ప్రభుత్వం పోడు భూములకు సాగునీరు అందించాలని భావించి ప్రయోగాత్మకంగా ఆదలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ మండలంలో గోండు కొత్తగూడ గ్రామానికి చెందిన నలుగురు గిరిజన రైతుల పోడు భూములలో బోర్లు వేశారు. ఈ గ్రామానికి చెందిన ఆడ కళాబాయి, ఆత్రం తానుబాయి, మడా విశ్యామ్‌రావు, తొడసం తురఫాబాయి భూములలో నాలుగు యూనిట్లను మంజూరు చేసి బోరుబావులు వేసిన గిరిజన సంక్షేమ అధికారులు సోలార్ ప్యానల్స్ కూడా బిగించారు. ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఈ పథకాన్ని పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు అందించనున్నారు.

ఘనంగా శబరి మాత ఆలయ వార్షికోత్సవం

● ఆలయ ప్రహరీ నిర్మాణానికి కృషి :ఆడె గజేందర్

నేరడిగొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల శబరి మాత ఆలయ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ హాజరై మండల నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆడె గజేందర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆడె గజేందర్ మాట్లాడుతూ రూ.ఐదు లక్షలతో ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శబరి మత భక్తులు, నాయకులు ఆడె వసంత్ రావ్, రాజశేఖర్ రెడ్డి, పెంట వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నేరడిగొండ: ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని అర్హులైన ప్రతీఒక్కరు ఈ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ నియోకజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ఆదివారం నేరడిగొండ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన మండాజి ప్రణీత్‌కు రూ. 60 వేలు, కుమారి గ్రామానికి చెందిన లావణ్యకు రూ. 12 వేల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, రమేష్, కపిల్ జాదవ్, కుంట శంకర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యువ నాయకులు ఎం.డి. సద్దాం, తదితరులు పాల్గొన్నారు.





● శబరిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్

● క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తూ..

ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా ఏరియా ఆసుపత్రి



ఏరియా ఆసుపత్రి అవరణలో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు

భైంసా, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఏరియా ఆసుపత్రి ప్రైవేట్ వాహనాల పార్కింగ్ అడ్డాగా మారింది. ఆసుపత్రి అవరణతో పాటు అవుట్ పేషెంట్ విభాగం వెళ్లే మార్గం, మార్చురీ గది ప్రాంతం పార్కింగ్ చేసిన ప్రైవేట్ వాహనాలతో నిండుకుంటోంది. భైంసా నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు చేపట్టే వారందరూ ఇంటి నుంచి బస్టాండ్ వరకు తమ తమ ద్విచక్ర వాహనాలతో వచ్చి వాటిని ఇక్కడి ఏరియా ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. సాయంత్రం వేళలో తిరిగి వచ్చి పార్కింగ్ చేసిన తమ ద్విచక్ర వాహనాలను తీసుకొని ఇంటికి పయనమవుతున్నారు. నిత్యం 100కు పైగానే ప్రైవేట్ వాహనాలు ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసి ఉంటున్నాయి. దీంతో చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు పాట్లు పడాల్సి వస్తోంది. ప్రైవేట్ వాహనాల నిలిపి ఉంటుండటంతో 108,102 అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఒక్కో పర్యాయం అంబులెన్స్‌లు బయటనే నిలిపి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో అంబులెన్స్‌లు లోనికి రావడానికి వీలులేక బయటనే నిలిపివేయాల్సి వస్తోంది. వాటిల్లో తీసుకవచ్చిన బాధితులను బయటి నుంచి స్ట్రేచర్‌పై ఆసుపత్రి లోనికి తీసుకరావాల్సి వస్తోంది. ఇక ప్రసవించిన బాలింతరాళ్లను ఇంటికి తరలించే 102 అంబులెన్స్‌లు సైతం బయట నుంచే సేవలు అందివ్వాల్సి వస్తోంది. డిశ్చార్జీ సమయంలో బాలింతరాళ్లు ఆసుపత్రిలోని ప్రసూతివార్డు నుంచి పసికందులతో అవస్థలు పడుతూ ఆసుపత్రి బయట వరకు నడుచుకుంటూ వచ్చి 102 అంబులెన్స్ ఎక్కాల్సిన పరిస్థితులున్నాయి. ఆరోగ్య పరీక్షలు, ప్రసవం కోసం ఆటోలలో వచ్చే గర్భిణీలు సైతం ఆసుపత్రి బయట వరకు ఆటోలో వచ్చి అక్కడి నుంచి లోపలికి నడుచుకుంటూ రావాల్సి వస్తోంది. ఆసుపత్రి నిర్వాహణాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రైవేట్ వాహనాలు నిలుపకుండా పకడ్బందీ చర్యలుచేపట్టి ఇక్కట్లను తొలగించాలని రోగులు కోరుతున్నారు.

రేపటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

● తహసీల్దార్ కే. శ్రీలత

ముథోల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జూన్ 3 నుంచి ముథోల్ మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రతీ రైతు వినియోగించుకోవాలని తహసీల్దార్ కే. శ్రీలత పేర్కొన్నారు. భూ భారతిలో భాగంగా ఈ నెల 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈనెల 3న చింతకుంట, రాంటెక్, 4న మచ్కల్, 5న వడ్తాల్, ముద్గల్, 6, 9 తేదీల్లో కారేగాం, జాలాల్‌పూర్, గోవిందపూర్, 6న తరోడా, 9, 10 తేదీల్లో పిప్రి, అలాగే 10న విట్టోలి, చందాపూర్, 11న చించాల, బ్రహ్మణ్‌గాం, 12న వెంకటాపూర్, గూడూర్, 12, 13 తేదీల్లో ఆష్టా, 13, 16 తేదీల్లో ఎడ్‌బిడ్, 13న గన్నోర, 16వ తేదీన బోరిగాం, 17న ముథోల్, రువ్వి, శెట్‌పల్లి గ్రామాల్లో సదస్సులు ఉంటాయని వెల్లడించారు. రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. భూ భారతి నూతన చట్టం ద్వారా ఫిర్యాదు అందిన తర్వాత గ్రామాల్లో విచారణ చేపట్టిన అనంతరం భూ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



ప్రమాదం జరిగిన చోట స్నానాలు చేస్తున్న భక్తులు



స్నానఘట్టాలు లేని చోట నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

● బాసర గోదావరి తీరంలో ప్రమాద స్థలాల్లో కొనసాగుతున్న భక్తుల స్నానాలు

● కనిపించని ముందస్తు చర్యలు ● పట్టించుకోని అధికారులు

బాసర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాసర వద్ద గోదావరిలో నీటిమట్టం కనిష స్థాయికి చేరింది. దీంతో భక్తులు స్నాన ఘట్టాల వద్ద కాకుండా నది పొడవునా స్నానాలు ఆచరించేందుకు ప్రయతిస్తున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట ఇద్దరు భక్తులు వేర్వేరు ఘటనల్లో ఒకే రోజు నీట మునిగి మృతి చెందారు. నదిలో అక్కడక్కడ ఉన్న లోతైన ప్రాంతాలు తెలియక స్నానాలకని దిగి మృత్యువాత పడుతున్నారు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు కానీ భక్తులకు అప్రమత్తం చేసే మనుషులు లేకపోవడంతో ఇక్కడున్న ప్రమాదకర పరిస్థితి తెలియక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అక్కడ అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే ప్రమాదాలు కొంత వరకు అడ్డుకట్ట వేచవచ్చు. కానీ ఏ అధికారి కూడా ఇక్కడ ప్రాణాలు పోతున్న పట్టించుకునే దాఖలాల్లేవు. దీంతో రెండు ఘటనలు జరిగినా ఇంకా భక్తులు ప్రమాద ప్రదేశాల్లో స్నానాలు చేయడం కొనసాగుతోంది.



నది మధ్యకు వెళ్లి స్నానాలు చేస్తున్న భక్తులు

జొన్నరైతులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జొన్నపంట కొనుగోళ్లు చేపట్టి ప్రభుత్వం జొన్నపంట సాగుచేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆదివారం మార్కెట్ కమిటీ ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎకరానికి ఎనిమిది క్వింటార్ల 40 కిలోలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం మొదట నిర్ణయిం చిందని అయితే రైతుల విజ్ఞప్తి మేరకు రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృషికి తీసుకువెళ్లగా ఎకరానికి 14 మేరకు కొనుగోలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. దీంతో రైతులు పండించిన పంట నంత అమ్ముకున్నారని అన్నారు. అయితే 18,971 ముందు రైతులు పండించిన జొన్న పంటను విక్రయించారన్నారు. అంతేగాక రైతాంగం జొన్నల తాలూకు డబ్బులను 15 రోజుల్లోగా ఇప్పించేందుకు రాష్ట్ర మంత్రి సీతక్క తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కొంత ఆలస్యమైన ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నాల డబ్బులు పంపిణీ చేస్తుందని వారు పేర్కొన్నారు. ప్రతిపక్షాల వారి మాటలు రైతులు నమ్మవద్దని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పి. చంటి, మాజీ ఎంపీటీసీ శేఖర్, రజియా బేగ, సోనాల మండల సీనియర్ నాయకులు గాజుల పోతన్న తదితరులు ఉన్నారు.

'ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు'

నిర్మల్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాగకాంత్, మహేంద్రాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూనే, మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదింపుకు ఉత్తర్వులు జారీ చేయడమేమిటని ప్రశ్నించారు. వేసవి కాలమంతా ఉపాధ్యాయులకు, అధికారులకు శిక్షణ, బడిబాట పేరుమీద అనేక కార్యక్రమాలు చేపడుతూనే మరొకవైపు పిల్లలు తక్కువగా ఉన్నారన్న ఉద్దేశ్యంతో టీచర్లను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయడం ద్వారా ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక తరగతి గది ఉండాలని చాలా కాలంగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు డిమాండ్ చేస్తున్నా అందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు.

చట్ట విరుద్ధ వ్యాపారాలు చేస్తే చర్యలు: డీఎస్పీ

ఆదిలాబాద్‌అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు, అమాయక ప్రజలను మోసం చేసే చట్ట విరుద్ధ వ్యాపారులు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రెండవసారి ఏకకాలంలో 11 మండలాల్లో 20 బృందాలతో ఆకస్మిక దాడి నిర్వహించి, 11 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ వివవరించారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులు, రిజిస్ట్రార్లు, స్థలాల ఇళ్ల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దూడను చంపిన నిందితుడి అరెస్టు

ఆవుదూడను చంపి అటవి జంతువుల మాసంగా అమ్మే ప్రయత్నం చేయాలనుకున్న నిందితున్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శనివారం గిమ్మ గ్రామ శివారు ప్రాంతంలో ఆవుదూడనుకత్తితో పొడిచి ప్రాణాపాయ స్థితిలో ఉన్నదని సమాచారం తెలిసిన వెంటనే జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సైలు వెటర్నరీ డాక్టర్‌తో కలసి సంఘటన స్థలానికి వెళ్లారన్నారు. అక్కడ కొన ఊపిరితో ఉన్న దూడను బ్రతించే ప్రయత్నం చేశారని, కత్తితో ఆవు దూడను పొడిచిన కారణంగా కొద్దిసేపటికి ఆవు దూడ ప్రాణాలను విడిచిందన్నారు. ఈ సంఘటన పై జైనథ్ సీఐ, ఎస్సై గౌతమ్‌లు విచారణ చేపట్టగా ఆవు దూడ సిర్సన్న గ్రామానికి చెందిన సాయికుమార్‌ది అని తెలిందన్నారు. ఉల్లంగించిన వారిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కలిశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, భైంసా మా ర్కెట్ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగ్రత్ ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి అజార్ హుస్సేన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జునైద్ మెమన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు మతిన్, మా జీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

'గురుకులాల సెక్రెటరీని సస్పెండ్ చేయాలి'

నిర్మల్ రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : దళిత విద్యార్థులు బాత్రూం కడగాలని కించపరుస్తూ మాట్లాడిన గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షినిని వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పోశెట్టి అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిని దళితులను అమానవించిన తీరు చాలా అభ్యంతరకరమని అన్నారు. ఆమెను వెంటనే సస్పెండ్ చేసి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గురుకులాలు కాపాడాలని లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందన్నారు.

గోశాల నిర్మాణానికి విరాళం

దిలావర్‌పూర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకాల్వ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద గోశాల నిర్మాణానికి కుంటల మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలైన ఎర్రోళ్ల శకుంతల వెంకటాద్రి తల్లి ఎర్రోళ్ల రాజు బాయి జ్ఞాపకార్థం రూ.లక్షా 50 వేల విరాళాన్ని అందజేశారు. సందర్భంగా దేవస్థానం తరుపున శకుంతలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గడ్డం నర్సారెడ్డి, వన్నెపన్ని శివకుమార్, గుమ్ముల నర్సయ్య, ఆలయ అర్చకులు రాము, వెంకటేష్, శ్రీనివాస్, శకుంతల కుటుంబ సభ్యులు సాదుల రాజేంద్రప్రసాద్, శిరీష, తదితరులు ఉన్నారు.

ఫటా..ఫట్...

ఎరువులు, విత్తనాలపై అవగాహన అవసరం

● కృష్ణవేణి, మండల వ్యవసాయ అధికారిణి, నేరడిగొండ



ఆంధ్రజ్యోతి: ఖరీఫ్‌లో రైతులు తీసుకోవాల్సిన చర్యలేంటి?

వ్యవసాయాధికారిణి: ఖరీఫ్ సీజన్ షురూ కానున్న నేపథ్యంలో మార్కెట్‌లో నకిలీల బెడద ఎక్కువగా ఉన్నందున కర్షకులు అప్రమత్తంగా ఉండాలని, విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి వివరించారు.

ఆంధ్రజ్యోతి: విత్తన కొనుగోళ్ళలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

వ్యవసాయాధికారిణి: వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అందులో విక్రయదారుడి పేరు, సంతకం, రైతు పేరు, విత్తన రకం, బ్యాచ్ నెంబర్, గడువు తేది, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: నకిలీ విత్తనాలను ఎలా గుర్తించాలి

వ్యవసాయాధికారిణి: లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు. నకిలీ చేసే అవకాశం ఉంటుంది. బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు దాచి పెట్టుకోవాలి.

ఆంధ్రజ్యోతి: విత్తనాలను ఎప్పుడు విత్తుకోవాలి

వ్యవసాయాధికారిణి: వర్షాలు కురిసిన తరువాత విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చి మొలక శాతాన్ని చూసుకోవాలి. సంతృప్తి కరంగా ఉంటేనే విత్తుకోవాలి. మొలకెత్తే దశ, పూత దశలోపంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: ఎరువులను ఎక్కడ కొనుగోలు చేయాలి?

వ్యవసాయాధికారిణి: అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒక వేళ చేతి కుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో సరిచూసుకోవాలి. ప్రామాణిక పోషకాలు వివరాలు, ఉత్పత్తి సంస్థ పేరు ఉంటేనే కొనాలి. బిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీగా గుర్తించాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

● (ఆంధ్రజ్యోతి, నేరడిగొండ)

మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం

ఎస్‌వీఈపీ అమలుకు ప్రభుత్వం కృషి

● పలు రకాల పరిశ్రమలపై మహిళలకు అవగాహన ● ఆర్థిక ఎదుగుదలకు చేయూతనిచ్చి ఆదుకునేందుకు కృషి



బోథ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జే గోవిందరావు (ఫైల్)



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌వీఈపీలు

బోథ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధిపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకోసం మహిళా సంఘాలను మరింత ప్రోత్సహించి వారిని ఆర్థికంగా ఎదిగే విధంగా చేపట్టి నూతన ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. అందుకోసం క్లస్టర్ల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించి కార్యక్రమం అమలుపై శిక్షణ ఇస్తున్నారు.

● **కొత్త రకం పరిశ్రమలపై దృష్టి**

పేదరిక నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన స్టార్ అఫ్ విలేజ్ ఎంటర్ ప్రీ మార్షిప్ ప్రోగ్రామ్ జాతీయ గ్రామీణ జీవన ఉపాధి మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. అయితే ఈ కార్యక్రమంలో ఇప్పటికే వ్యాపారంలో నిమగ్నమైన వారిని మరింతగా ప్రోత్సహించేందుకు ఆర్థికంగా ఎదిగేవిధంగా రుణ సదుపాయం కల్పించనున్నారు. నూతనంగా చిన్నపాటి పరిశ్రమలకు ప్రారంభించుకునేందుకు ఈ కార్యక్రమంలో రుణాలను అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

● **రుణం ఇప్పించడం రికవరీ చేయడం బాధ్యత**

మహిళలకు రుణం ఇప్పించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయడంతో పాటు వారి నుండి ఇచ్చిన డబ్బు రికవరీ చేయించడం కోసం నూతనంగా నియమించబడ్డ ఎస్‌వి ఈ సిబ్బంది కృషి చేయాల్సి ఉంటుంది. అంతేగాక వారు మరింత నైపుణ్యత సాధించేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

● **రుణం ఇచ్చేందుకు నిధులు సిద్ధం**

మహిళ ఆర్థిక అభివృద్ధికి రుణాలను ఇచ్చేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. అయితే డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలకు స్వయం ఉపాధితో పాటు ఆర్థిక అభివృద్ధి కల్పించేందుకు ఈ నిధులను రుణంగా ఇవ్వనట్లు అధికారులు పేర్కొంటున్నారు. అక్కడ మహిళలు ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ వలలో పడకుండా అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బంది సైతం మైక్రో ఫైనాన్స్‌లపై దృష్టి సారించి మహిళా గ్రూపుల వారిని ప్రైవేట్ ఫైనాన్స్‌లలో రుణం పొందకుండా చూడాలని సీసీలను ఇప్పటికే ఆదేశించారు.

● **సీసీలపై మరింత బాధ్యత**

ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న సిసిలపైన ప్రభుత్వం మరింత భారం వేయాలని ఉంది. అందులో భాగంగానే నూతనంగా ఏర్పాటైన గ్రామీణ జీవన ఉపాధి మిషన్ సిబ్బందితో కలిసి పని చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో అర్హులైన మహిళా గ్రూపులను అభివృద్ధి చెందిన తర్వాత వెలుగు సీసీలు వారి బయోడేటాను ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉంది. గ్రామాల వైపు వెళ్ళని సీసీలు ఇకపై పల్లెలకు పరుగులు తీయాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఏది ఏమైనా మహిళా ఆర్థిక అభివృద్ధి పైన ప్రభుత్వం ప్రత్యేక దృక్ష సారించింది.



బోరజ్ మండల టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

బక్రీద్ నేపథ్యంలో గోవులు, పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. పశువు లను అక్రమంగా తరలించడాన్ని నియంత్రించడంలో జిల్లావ్యాప్తంగా అంతర్రాష్ట్ర రహదారుల గుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది విరివిగా వాహనాలను తనిఖీ చేస్తూ పశువులు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని అనుమతులు ఉన్న పశువులను సైతం వాహనాల్లో సరైన పద్ధతిలో తరలించాలని, వాటికి నీరు, ఆహారం వసతి కల్పించాలని అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన పలువురిపై ఇటీవల ఎనిమిల్ క్రుయాలిటి యాక్ట్ కింద కేసులు సైతం నమోదు చేయడం గమనార్హం.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)



విత్తనం నాటకున్నా మొలకెత్తింది!







ఫొటో న్యూస్





విత్తనం నాటకుండానే మొలకెత్తిన దృశ్యాలు

ఇదేంటి భూమిలో విత్తనం నాటకుండానే మొలకెత్తడం ఏంటని అనుకుంటున్నారా..? ఇదంతా ముందస్తు వర్షాలు తీసుకొచ్చిన విచిత్ర పరిస్థితి. కిందటి ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి పంట పూర్తయిన తర్వాత రైతులు మరుసటి పంట కోసం నేలను శుభ్రం చేస్తుంటారు. కాని వేసవి దుక్కులు పూర్తయినప్పటికీ మిగతా చదును చేయడం పూర్తి కాకుం డానే అకాల వర్షాలు కురవడంతో గత పంటకు సంబంధించిన విత్తనాలు ఇలా మొలకెత్తి కనిపించాయి. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం..

లాభసాటి వ్యవసాయానికి సోపానం

ముథోల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గురించి జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ సంవత్సరం 'నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని డా.రాంప్రసాద్ (ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా నోడ్ అధికారి), ముథోల్ ప్రధాన శాస్త్రవేత్త డా.నర్సయ్య, డా.విజయ్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిక చేసిన రైతులకు కొద్ది మొత్తంలో పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేయబడిన నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేయబడిన ముగ్గురి నుంచి ఐదుగురు అభ్యుదయ రైతులకు అందజేయబడుతుందన్నారు. ఈ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు జూన్ 2వ తేదీన ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించబడుతుందని తెలిపారు. అనంతరం మండలాల్లో గల ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నాణ్యమైన విత్తనాన్ని రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాన్ని తోటి రైతు సోదరులకు తక్కువ ధరకే అందజేయాలని, ఎంపిక చేయబడిన రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా రానున్న రెండు, మూడు సంవత్సరాల్లో ప్రతీ గ్రామాన విత్తన స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే ముఖ్య ఆశయమని తెలిపారు. రైతు సోదరులు ఈ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

పలుచబడ్డ అడవులు.. పంట పొలాల్లోకి వన్య మృగాలు



బావిలో పడ్డ ఏనుగు బంటు (ఫైల్)

బోథ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు దట్టమైన అడవులలో నివసించే చిరుత ఎలుగు బంట్లతో పాటు వేట కుక్కలు అడవులను వదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. గత ఏడు నెలల క్రితం అడవిని వదిలిన పులి జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. అయితే ఆ విషయం మరిచి పోక ముందే మళ్లీ జనావాసాల సమీపంలోకి చిరుతలు ఎలుగుబంట్లు వస్తున్నాయి.

● **అటవీ విస్తీర్ణం తగ్గడమే**

ఒకప్పుడు దట్టమైన అడవులతో నిండి ఉన్న జిల్లా క్రమక్రమంగా స్మగ్లర్‌ల ధన దాహానికి అడ వులు కరిగిపోతూ వస్తున్నాయి. మరోవైపు పోడు వ్యవసాయం సాగు పెరగడంతో అటవీ విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. అయితే అడవుల్లో లభించే అటవీ ఫల వృక్షాలతో పాటు జంతు జాలం సైతం అంతరించి పోతున్నదని అటవీ శాఖ వారు అంటున్నారు. అడవుల నరికివేత ఆపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటూ ఉండగా అడవులను నరికే వారికి రాజకీయ అండదండలు ఉండడంతో అటవీ విస్తీర్ణం తగ్గుతున్న అధికారులు చర్యలు తీసుకునేందు కు వెనుకాడాల్సి వస్తుంది.

● **అడవుల నరికివేత ఆగకపోతే ..**

అడవుల నరికివేత ఆపకపోతే మానవ మనుగడకే ముప్పు వాటి ఆస్కారం ఉంటుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఎండల తీవ్రతతో పాటు వరదలు చలి తీవ్రత ఏడాదికి ఏడాది పెరుగుతూ ఉండడంతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఈ విషయమై ప్రజలను చైతన్యం చేయకపోతే అడవి జంతువులు గ్రామాలపై దాడులు చేసే ఆస్కారం ఉంటుందని అంటున్నారు.



ఏనుగు బంటు

● **వన్య మృగాలను వేటాడినా..**

అడవులు నరికినా.. కేసులు తప్పవు!

అడవుల్లో ఉండే వన్య మృగాలను వేటాడిన అడవులు నరికి వేసిన కఠిన చర్యలు తీసుకుంటామని రేంజ్ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. ఇప్పటికే అడవి జంతువులను వేటాడిన వారిపై కేసులు వేయడం జరిగిందని అక్రమంగా అడవులను నరికి వేసిన వారిని విడిచి పెట్టేది లేదన్నారు. కొంత మంది పోడు వ్యవసాయం పేరట అడవులను నరికి వ్యవసాయం చేయ కుండా కవులుకు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిని గుర్తిస్తున్నామని పేర్కొ న్నారు.

బాస్మతి వరి విత్తనాలు ఇచ్చారు.. కొనుగోలు చేస్తామని మాట తప్పారు!

● **చాక్‌పల్లి గ్రామ రైతుల దీన పరిస్థితి**

నర్సాపూర్(జి), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన పది మంది రైతులు బాస్మతి రకం వరి పంట సాగు చేశారు. రైతులకు ధర్మోరా గ్రామానికి చెందిన ప్రవీణ్ రెడ్డి, వన్నెల్(బి) గ్రామానికి చెందిన లింగారెడ్డి బాస్మతి రకం బస్తాలను రైతులకు సాగు చేయాలని అందించారు. పంట వచ్చిన తర్వాత 3700 రూపాయలకు క్వింటాల్ చొప్పున కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులతో వచ్చి పంటలను చూసి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కో బస్తా 20కిలోలు ఉంటుందని పది మంది రైతులకు 25 బస్తాల బాస్మతి రకం విత్తనాలను అందించి వెళ్లారు. పంట పండిన తర్వాత కొనుగోలు చేయకపోవడంతో రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన రైతులు లిం గన్న, అశోక్, రాములు, సాయన్న, రాజన్న, అత్తర్, ఎర్రోళ్ల సాయన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విత్తనాలు ఇచ్చి పంట కొనుగోలు చేస్తానని మో సం చేసినట్లు ఎస్సై దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులతో ఫిర్యాదు అందజేశారు. ఇప్పటి వరకు ఎటువంటి పంట కొనుగోలు చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం వరి కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు కూడా బాస్మతి వరి రకం పనికి రాకపోవడంతో రోడ్డుపై ఆరబెట్టిన వరి ధాన్యం మొలకెత్తుతున్న విత్తనాలను చూసి రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. తక్షణమే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని మండల రైతులు అంటున్నారు.



బాస్మతి వరి ధాన్యం కొనుగోలు చేస్తానని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న చాక్‌పల్లి గ్రామ రైతులు



రైతులకు సరఫరా చేసిన బాస్మతి వరి రకం విత్తనాలు



బాస్మతి రకం వరి ధాన్యం చూపుతున్న రైతు



జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నకిలీ విత్తనాలు, ఎరువులపై ఉక్కుపాదం : ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సీసీఎస్ బృందం ఆధ్వర్యంలో పోలీసు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి గత వారం రోజుల వ్యవధిలో మూడు కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నమోదైన మూడు కేసులలో ఏడుగురి పై కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అమాయక, ఆదివాసీ ప్రజలకు నకిలీ విత్తనాలను అందించి మోసం చేసే ఏ ఒక్కరిని జిల్లా పోలీసు యంత్రాంగం విడిచి పెట్టదని, వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాల రవాణా విక్రయాలపై ప్రత్యేకదృష్టి సారించి నిఘా వ్యవస్థను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు, రైతులు ముఖ్యంగా ప్రభుత్వం ద్వారా గుర్తించబడిన దుకాణాలలో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసే ముందు విత్తన ప్యాకెట్లపై సరైన లేబుల్, తయారీ తేదీ, ఎక్స్పైరీ తేదీ ఉండేలా చూసుకోవాలన్నారు. విత్తనాలను తీసుకున్న తర్వాత దుకాణ యజమాని వద్ద నుంచి బిల్లును గ్రహించాలని సూచించారు. నకిలీ విత్తనాలపై ఎలాంటి సమాచారం ఉన్న ఫోన్ నెం. 8712659965 సంప్రదించాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ పేర్కొన్నారు. సీసీఎస్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలను అరికట్టడం జరుగుతుందని తెలిపారు. అయితే, గతంలో కేసులు నమోదైన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

పోలీసు పతకాల జాబితా విడుదల

● జిల్లాలో ఏడుగురికి సేవా పతకాలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు పతకాల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో ఏడుగురు ఈ సేవా పతకాలు అందుకోనున్నారన్నారు. వారిలో ఉత్తమ సేవా పతకంను కె.నర్సయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ పీసీఆర్ ఆదిలాబాద్ అందుకోనున్నారు. అలాగే సేవా పతకంను కె.విష్ణు ప్రకాష్, సబ్ ఇన్‌స్పెక్టర్ టూటౌన్ పోలీసు స్టేషన్, బి.రవీందర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ గుడిహత్నూర్ పోలీసు స్టేషన్, ఎ.నాగేశ్వర్ కానిస్టేబుల్ గాదిగూడ, కె.కిషన్ ఏఆర్ కానిస్టేబుల్ ఆదిలాబాద్, ఎ.రాము ఏఆర్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్, సీహెచ్ గోపాల్ కానిస్టేబుల్ గాదగూడ పోలీసు స్టేషన్‌లు పతకాలను అందుకోనున్నారని పేర్కొన్నారు. అయితే, వీరికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందనలు తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు దీనిని గమనించి ఈ నెల 2న కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు : ఆర్డీవో

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం ఈ ఏర్పాట్లను అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం ముఖ్యఅతిథి ముందుగా అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి అక్కడి నుంచి కలెక్టరేట్‌లో జరిగే వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదు : విశ్రాంత అధికారి

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదని విశ్రాంత లేబర్ అధికారి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో కార్మికులతో సమావేశం ఏర్పాటుచేసి వారి కోసం ఉన్న చట్టాలను తెలియజేశారు. చట్టాలు,హక్కుల గురించి తెలియక పథకాలను పొందలేక పోతున్నారన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మిక అధికారి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కార్మికులకు రావాల్సిన ఫలాలు సక్రమంగా వచ్చేవి అన్నారు. కానీ ఇప్పుడు పేమెంట్స్ లేట్ అవుతున్నాయని, కార్మిక శాఖ అధికారులు జవాబులు కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పాత పద్దతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పోశన్న, కార్మికులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా మిరుగు బోనాలు


భీంపూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి, కరంజీ(టి), అంతర్గం, నిపాని, దన్నోర, గోమూత్రి, వాడుర్ గ్రామాలలో ఆదివారం మిరుగు బోనాలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో ఉన్న పెద్ద పోచమ్మ, ముత్యాలమ్మ, దొడ్డి పోచమ్మ, మంద పోచమ్మ దేవతలకు నైవేద్యం సమర్పించారు. అంతేకాకుండా కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు హారతులతో గ్రామ దేవతలకు గంగా జలాలతో అభిషేకాలు సైతం చేశారు.



పిప్పల్‌కోటి గ్రామంలో పెద్ద పోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళా భక్తులు



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం



● బోరుబావికి సౌర విద్యుత్ బిగించిన దృశ్యం



● గోండు కొత్తగూడ గిరిజనుల పోడు భూముల్లో బోరువేస్తున్న దృశ్యం

- గిరిజన రైతుల పోడు భూములకు సాగునీరు
- రూ.12,600 కోట్ల వ్యయంతో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం
- పోడు సాగు చేస్తున్న గిరిజనులకే ఈ పథకం
- ప్రయోగాత్మకంగా గోండు కొత్తగూడలో..
- ఉమ్మడి జిల్లాలో తొలి విడత 7,868 ఎకరాలలో అమలు

పోడు భూముల్లో.. సౌర గిరిజల వికాసం

ఉట్నూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులందరికీ సాగునీరు అందుబాటులోకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం అందుబాటులోకి తెచ్చింది. రూ.12,600 కోట్లతో ఐదేళ్ల పాటు పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతుల భూములకు సోలార్ విద్యుత్ అందజేసి బోరుబావుల ద్వారా సాగునీరు అందించడానికి ప్రణాళిక అమలు చేస్తుంది. ప్రభుత్వం ఇప్పటికే ఇందిరా సౌరజల వికాసం పథకం అమలు చేయడానికి 2025-26 నుంచి 2029-30 వరకు ఈ కార్యక్రమం నిర్వహించడానికి జీవో 15 విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పోడు భూములను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. అనంతరం భూగర్భ జలాలు వినియోగించడానికి బోరుబావులు వేసి సోలార్ కరెంట్ అమర్చి సాగునీరు పంటలకు అందించేలా కృషి చేయనున్నారు. డిసెంబరు 2005 వరకు పోడు వ్యవసాయం చేస్తూ హక్కు పత్రాలు కలిగి ఉన్న గిరిజన రైతులకు లాభం కలిగించడానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 2.10 లక్షల గిరిజన రైతులకు ప్రయోజనం కలిగించనున్నారని తెలుస్తుంది. 2025-26 సంవత్సరంలో పది వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాలలో ఒక్కొక్క యూనిట్ ఆరు లక్షలతో అమలు చేసి రూ.ఆరు వందల కోట్లు ఖర్చు చేయాలని భావిస్తున్నారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో 50 వేల మంది గిరిజన రైతులకు చెందిన 1,43,204 ఎకరాలకు రూ.3000 కోట్లు, 2027-28, 2028-29, 2029-30 ఆర్థిక సంవత్సరంలో లక్షా 43 వేల ఎకరాలకు సంబంధించిన 50 వేల మంది రైతులతో ప్రతియేటా రూ.3000 కోట్లను ఖర్చు చేయాలని భావిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఐదేళ్లలో 2.10 లక్షల మంది రైతులకు ఆరు లక్షల ఎకరాల పోడు వ్యవసాయ భూములను రూ.12,600 కోట్లతో ఇందిరా సౌర గిరిజల వికాసం అమలు చేయనున్నారు. అంతేకాకుండా ఉట్నూర్, భద్రాచలం, ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో ప్రాజెక్టు అధికారుల నేతృత్వంలో మైదాన ప్రాంతాలలోని గిరిజన పోడు భూములలో ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇందిరా సౌర గిరిజల వికాసం కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

తొలి విడతగా 7,868 ఎకరాలలో అమలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో 7,868 ఎకరాలలో లబ్ధిదారులకు ఇందిరా సౌర జలవికాసం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1,135 మంది రైతులకు చెందిన 3,128 ఎకరాలలో, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,104 రైతులకు చెందిన 3,034 ఎకరాలలో, నిర్మల్ జిల్లాలో 468 మంది రైతులకు చెందిన 1,290 ఎకరాలలో, మంచిర్యాల జిల్లాలోని 151 మంది రైతులకు చెందిన 416 ఎకరాలలో ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

పోడు భూముల లబ్ధిదారులకే..

2006 అటవీ హక్కుల చట్టం ద్వారా సంక్రమించిన పోడు భూముల లబ్ధిదారులకి వర్తించేలా ఇందిరా సౌర గిరిజన వికాసం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ముందుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పోడు భూములను అభివృద్ధి చేస్తారు. రైతులకు లబ్ధి కలిగించేలా బావులు, బోరుబావులను ఏర్పాటు చేస్తారు. 5 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీ సోలార్ పంపు సెట్లు, సోలార్ ప్యానెల్‌ల ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించి భూములకు సాగు నీరు కల్పించేలా అధికారులు చూస్తారు. పోడు భూముల్లో నీటి సర్వే

(తరువాయి 4వ పేజీలో...)

కరెంట్ కోసం ఎదురు చూశాం..

: ఆడ కళాబాయి, మహిళా రైతు, గోండు కొత్తగూడ



అనాదిగా పోడు భూములు సాగు చేస్తున్న తమకు సాగునీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నాం. త్రిఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించడంలో విద్యుత్ అధికారులు విఫలమయ్యారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సౌర గిరిజల వికాసం పథకం ద్వారా మా భూములకు సాగునీరు అందుబాటులోకి వస్తున్నందున సంతోషంగా ఉంది.

ఇది బృహత్ పథకం : వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే ఖానాపూర్



దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఇందిరా గిరిజల వికాసం పథకం బృహత్ పథకం. ఐదేళ్ల కోసం రూ.12,600 కోట్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ పథకం అమలు కానుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 10 వేల మంది పోడు రైతులకు ఈ పథకం ద్వారా భూములలో బోర్లు వేసి, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సాగునీరు అందించడం జరుగుతుంది. అటవీ ప్రాంతాలలో ఉన్న పోడు భూములలో త్రిఫేస్ కరెంట్ సౌకర్యం అందించడానికి అటవీ శాఖ అడ్డంకులు తెలపడంతో ప్రభుత్వం ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అందుబాటులోకి తెచ్చింది.

నేడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

● జిల్లాలో విద్యుత్ కాంతులతో ముస్తాబైన పలు ప్రభుత్వ కార్యాలయాలు ● కలెక్టరేట్‌లో జెండా ఎగుర వేయనున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ● ఐటీడీఏలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రభుత్వ సూచనల మేరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉత్సవాలను ఘనంగా జరపనున్నారు.ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్‌ఆలీ కార్యక్రమ ముఖ్యఅతిధిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ సలహదారులు ఉద యం 9.35 నిమిషాలకు ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించనున్నారు. 9.40కి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరేట్‌లో జరిగే వేడుకల్లో పాల్గొంటారు. అటు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో ఎంతో సుందరంగా కార్యాలయ అధికారులు ముస్తాబు చేయించారు. విద్యుత్ కాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి. మొత్తంగా ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని విధాల ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

● ఐటీడీఏలో ఏర్పాట్లు పూర్తి

ఉట్నూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు పరిపాలన అధికారి దామోదర స్వామి ఆధ్వర్యంలో షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. సరిగ్గా ఉదయం 9 గంటలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం జరిగే సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా.. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో పాటు ఐటీడీఏలోని యూనిట్ అధికారులు హాజరవుతారు. రాష్ట్రంలో ఐటీడీఏ ద్వారా గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం జరుగుతున్న ప్రగతి నివేదికను ప్రాజెక్టు అధికారి వివరిస్తారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలను రంగు రంగుల దీపాలతో అలంకరించారు. ఇది ఇలా ఉండగా రాజకీయ పార్టీలకు చెందిన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితిల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయనున్నారు. ఈ మేరకు ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్ని మండలాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.



ఐటీడీఏ ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్ల దృశ్యం



ఆవిర్భావ వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్‌లోని స్తూపం



.. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న అమరవీరుల స్తూపం



ఆవిర్భావ వేడుకలకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేసిన దృశ్యం

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

● 3 నుంచి మండలంలో ప్రారంభం : తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈనెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, ఈ సదస్సులను రైతులు సద్వినియోగ పరుచుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి పథకాన్ని ప్రారంభించిందని, ఈ పథకం ద్వారా సమస్యను పరిష్కరించేందుకు తలమడుగు మండలంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల మూడు నుంచి 20 వరకు రెండు టీములుగా ఏర్పాటు చేసి ప్రతీరోజు రెండు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి నాలుగు గంటల వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈనెల 3న కోసాయి. రుయ్యాడి, 4న ఉమ్రి, అర్లి(కె) 5న దహేగావ్, కుచలాపూర్, 6న కప్పర్ దేవి, సుంకిడి, 9న ఝరి, లింగి, 10న రత్నాపూర్, ఉండం, 11న బరంపూర్, పల్సి(బి), 12న నందిగామ్, పల్సికే, 13న మదనపూర్, కజ్జర్ల, 16న దేవాపూర్, ఖోడదు, 17న పంగిడి, పిప్రి, తలమడుగు, 18న పల్లి (బి), డోర్లి, 19న పల్లికె, కొత్తూరు, 20న లచంపూర్, సికినాపూర్, ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



● మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమోహన్

పురాతన శివాలయం ముందర..

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుడిహత్నూర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన శివాలయం ముందర రూ.నాలుగు లక్షల వ్యయంతో నిర్మించే షెడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి, నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కొల్హారీకి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆడె శీల, ఆలయ కమిటీ అధ్యక్షుడు ధరంపాల్ అగర్వాల్, నాయకులు నాగ్‌నాథప్పా, కరాడ్ బ్రహ్మానంద్, ప్రహ్లాద్, శంకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్



అడవులను వదిలి.. పంటపొలాల్లోకి వన్య మృగాలు!

5లో

● రోజురోజుకూ పలుచబడుతున్న అడవులు ● చెట్ల నరికివేత ఆగకపోతే అంతే సంగతులు

● వన్య మృగాలను వేటాడినా.. అడవులలో చెట్లను నరికినా కేసులు తప్పవు : రేంజ్ అధికారి ప్రణయ్